భక్తులతో కిక్కిరిసిన శైవక్షేత్రాలు

- ఘనంగా కార్తిక పౌర్ణమి పూజలు
- పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు
- కార్తిక దీపాలు వెలిగించిన మహిళలు

మదనపల్లె సిటీ : కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలోని శివాలయాల్లో పౌర్ణమి వేడుకలుల ఘనంగా నిర్వహించారు. శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో స్వామికి అన్నాభిషేకం రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పండ్లు, పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ఫణికుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మదనపల్లెలో..

మదనపల్లె సిటీ : కార్తిక పౌర్ణమి వేడుకలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మదనపల్లె పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీపాల వెలుగుల్లో ఆలయాలకు ప్రత్యేక శోభ చేకూరింది. స్థానిక సీటీఎం రోడ్డులోని శ్రీ మంజునాథస్వామి ఆలయంలో సాయంత్రం మహిళలు ఆలయం ధ్వజస్తంభం ఎదుట దీపాలు వెలిగించారు.

వైభవంగా లక్షదీపారాధన

నిమ్మనపల్లె : మండలంలోని శ్రీ యోగనేలమల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా లక్షదీపారాధన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు మహిళలు పెద్ద ఎత్తున ఉపవాసదీక్షలతో వచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి లక్షదీపారాధన చేశారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, రూరల్ సీఐ రమేష్, ఎస్.ఐ తిప్పేస్వామి, జెడ్పీటీసీ దంపతులు వెంకటరమణారెడ్డి, ప్రమీలమ్మ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు వారికి ఆశీర్వచనాలు పలికి స్వామివారి శేషవస్త్రాలను అందించారు. రాత్రి 7 గంటల నుంచి స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్థానిక గార్గేయ శిఖరంలో నాగులయ్యగారిపల్లె బంగి క్రిష్టప్పచే ఆనవాయితీగా జ్యోతి ప్రజ్వలన చేశారు. కళ్యాణోత్సవం అనంతరం వీధినాటకం, చెక్కభజనలతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. తీర్థప్రసాదాల వినియోగం అనంతరం రాత్రి 12 గంటలకు చంద్రదర్శనం (పాలల్లో చంద్రుని చూచుట) అనంతరం పాలను భక్తులు తీర్థంగా సేవించారు. పెద్ద ఎత్తున భక్తుల కోసం స్థానిక గ్రామ ప్రజలు, నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక దీపారాధన

కలకడ : కార్తీక పౌర్ణమి సందర్భంగా గురువారం కలకడ శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలను భక్తి శ్రద్ధలతో భక్తులు వెలిగించారు. మహిళలు ఉపవాస దీక్షతో ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఝరికోనలో భక్తులు లక్షదీపారాధన కార్యక్రమంలో పాల్గొని పవిత్ర ఝరికోనలో దీపాలు వదిలారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

పీలేరురూరల్ : కార్తీక మాసం పౌర్ణమిని పురస్కరించుకుని కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, శ్రీ రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు నేతి దీపాలు వెలిగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలు కిటకిటలాడాయి.

శంభో... శివశంభో శంకర

తంబళ్లపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

మల్లయ్యకొండపై కోలాహలంగా కార్తీక పౌర్ణమి

కురబలకోట : కార్తీక పౌర్ణమి సందర్భంగా అంగళ్లు మల్లయ్య కొండకు భక్తులు, మహిళలు పోటెత్తారు. ఉదయం నుండి రాత్రి పొద్దుపోయే వరకు మహిళలు దీపాలు వెలిగించారు. మండలంలోని అంగళ్లు దగ్గరున్న చిన్నతట్టివారిపల్లె జ్యోతి టిఫిన్ సెంటర్ నిర్వాహకులు జ్యోతి, ఆనంద కొండపై భక్తులకుపెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. వీరిని ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి సత్కరించారు.

చంద్రశేఖరస్వామి ఆలయంలో తెప్పోత్సవం

రామసముద్రం : మండల కేంద్రంలోని అతిపురాతన శ్రీ చంద్రశేఖరస్వామి ఆలయంలో వైభవంగా కార్తిక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలాస్వామి, రవిస్వామిలు భక్తులకు దర్శనం కల్పించారు.



మదనపల్లె సిటీ: నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కలకడ: సిద్దేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



మదనపల్లె సిటీ : అన్నాభిషేకంతో ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు



మదనపల్లె : ప్రత్యేక అలంకరణలో వరాల అంజన్న



కురబలకోట : అంగళ్లు మల్లయ్యకొండపై దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పీలేరురూరల్ : కార్తీక దీపోత్సవంలో భక్తులు

క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పీలేరురూరల్ : కార్తీక మాసం పౌర్ణమిని పురస్కరించుకుని పీలేరు డిపో నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సులు తరలివెళ్లాయి. శుక్రవారం ఉదయం బస్సులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం బి. కుమార్ మాట్లాడుతూ భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే అయ్యప్ప స్వామి భక్తుల కోసం శబరిమలకు అద్దెప్రాతిపదికన బస్సులు పంపిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, బస్‌స్టేషన్ మేనేజర్ బాబునాయక్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

పీలేరురూరల్ : స్థానిక సదుం మార్గంలో శ్రీ లక్ష్మీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పీలేరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ వి. రామచంద్ర మాట్లాడుతూ తమవంతు సాయంగా చలికాలంలో ఆదుకోవడానికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శెట్టి సుబ్రమణ్యం, కార్యదర్శి సురేష్, నాయకులు జగన్‌మోహన్, వై.వి. రమణ, రాచపల్లె కృష్ణమూర్తి, పోతంశెట్టి రమేష్, సుధాకర్‌బాబు, రామకృష్ణ, అక్రమ్‌బాషా, జి.వి. రమణ, రామాంజినేయులు, దర్బార్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు విద్యార్థులకు పుస్తకాల వితరణ

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు హైదరాబాదుకు చెందిన వాసుసాయిరామ్ నోటు పుస్తకాలు ఉచితంగా అందజేశారు. ఈ పుస్తకాలను ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు అందించారు. ప్రతి ఏడాది వాసుసాయిరామ్ పిల్లలకు పుస్తకాలు అందజేస్తున్నట్లు వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ లీనాకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి మండల పూజలు

మదనపల్లె సిటీ : స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం నుంచి మండల పూజా కార్యక్రమాలు ప్రారంభంకానున్నట్లు అయ్యప్పస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు బాలుస్వామి, శివ, బాలుయాదవ్, అర్చకులు కార్తీక్ దీక్షిత్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం గణపతి హోమం, ధ్వజారోహణం తదితర పూజలు జరుపుతామన్నారు. ప్రతి రోజు ఉదయం, రాత్రి అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

నేడు కార్తిక వనమహోత్సవం

పీలేరురూరల్ : స్థానిక సదుం మార్గంలోని శ్రీ సర్వోదయ విజ్ఞాన క్షేత్రంలో శనివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో కార్తీక వనమహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు స్వామి కృష్ణానంద తెలిపారు. శనివారం ఉదయం తులసీమాత పూజ, గోమాత పూజ, దామోదరస్వామి పూజలు, అనంతరం సామూహిక గీతాపారాయణం, స్వామి ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. అనంతరం ఉసిరిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించడం, మహామంగళహారతి ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఇన్‌చార్జి జేఈగా సాయిరాజేంద్ర

పెద్దతిప్పసముద్రం : పంచాయతీరాజ్ ఇన్‌చార్జి జేఈగా బూర్లపల్లి ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయిరాజేంద్రను నియమించామని ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ శుక్రవారం తెలిపారు. గతంలో ఇక్కడ జేఈగా పనిచేసిన నిరంజన్ పీఐయూ ప్రాజెక్టుకు బదిలీ అయ్యారని ఎంపీడీవో తెలిపారు.

ఏవోగా జ్యోతిలత

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏవో)గా శుక్రవారం జ్యోతిలత నియమితులైనట్లు ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. ఈమె గతంలో తిరుపతి రూరల్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ ఏవోగా పని చేసిన గిరిధర్‌రెడ్డి చిత్తూరు జిల్లా పరిషత్‌కు బదిలీ అయ్యారు.

బాధ్యతల స్వీకరణ

మదనపల్లె : మదనపల్లె వన్‌టౌన్ సీఐగా ఎరీషావలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో భాగంగా కర్నూలు డీసీఆర్‌బీలో పని చేస్తున్న ఎరీషావలీ వన్‌టౌన్ సీఐగా విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న చాంద్‌బాషా అన్నమయ్య జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. ఎరిషావలీ గతంలో టు టౌన్ ఎస్ఐగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్‌టౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ప్రజలు సహకరించి అసాంఘిక కార్యక్రమాలపై సమాచారం అందించాలన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు : 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలపై వెంటనే ప్రభుత్వం దృష్టిసారించి పరిష్కరించాలని కోరారు. ఈ నెల 25 నుంచి సమ్మెలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రహంతుల్లా, బి.వి. చలపతి, శ్రీనివాసులు, రవి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు : నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు, ఉద్యోగవకాశాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలకడ : పుస్తకాలు మంచి మిత్రునితో సమానమని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఇ.రెడ్డెప్పరెడ్డి అన్నారు. గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తకాలు ఎంత చదివితే అంత మేధస్సు పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి అమరనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కలికిరి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం గ్రంథాలయ అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానిక శ్రీనివాస కళాశాల విద్యార్థులు, అక్షర పాఠశాల విద్యార్థులు హాజరై పుస్తక ప్రదర్శనను తిలకించారు.

కురబలకోట : ఒక మంచి పుస్తకం వంద మంది మిత్రులతో సమానమని కురబలకోట వ్యవసాయాధికారి రాధ తెలిపారు. గ్రంథాలయాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. పుస్తక పఠనం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.

తంబళ్లపల్లె : స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన పాఠకులను ఆకట్టుకుంది. పలురకాల గ్రంథాలు భారత, రామాయణ గాథలు విద్యార్థులకు పోటీ పరీక్షలకు దోహదపడే పుస్తకాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. టీచర్ వెంకటనారాయణ పుస్తక పఠనంతో కలిగే విజ్ఞానం గురించి వివరించారు.

మదనపల్లె సిటీ : స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పుస్తకాలను అందుబాటులో ఉంచారు. నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి గ్రంథాలయాల ఉపయోగం గురించి విద్యార్థులకు వివరించారు. పుస్తక పఠనం గురించి తెలియజేశారు.



మదనపల్లె సిటీ: విద్యార్థికి మెమెంటో అందజేస్తున్న రచయిత నాగరాజ

సీటీఎం వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె సిటీ : ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించడమే కాకుండా ఆశా కార్యకర్తలపై వేధింపులకు పాల్పడుతున్న మదనపల్లె మండలం సీటీఎం వైద్యాధికారి ఝాన్సీలక్ష్మి, సీహెచ్ఓ అరుణ, సూపర్‌వైజర్ సుమతిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ మాట్లాడుతూ ఓపీ డ్యూటీలు చేపిస్తున్న వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆశ వర్కర్లకు పని భారం తగ్గించాలని, ఆన్‌లైన్ పనులు, రికార్డు పనులు చేయించడం మానుకోవాలన్నారు. అధికారులు వేధింపులు, బెదిరింపులు ఆపాలన్నారు. ధర్నా చేస్తే మెమోలు ఇస్తామని బెదిరించడం దారుణమన్నారు. న్యాయం చేయకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు, సీఐటీయు జిల్లా కోశాధికారి హరిశర్మ, నాయకులు రమామణి, మల్లేశ్వరి, నాగరత్న, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ లక్ష్యాలను అధిగమించాలి

పెద్దమండ్యం : పక్కాగృహాల నిర్మాణ లక్ష్యాలను అధిగమించాలని ఆ శాఖ ఈఈ వెంకటదాస్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏపీఎం, ఏపీవోలతో పక్కాగృహాల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో మంజూరైన గృహాలు, పునాది, లెంటల్ లెవల్ గృహాలు, పూర్తి చేసిన గృహాల వివరాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈఈ మాట్లాడుతూ వారానికి 15 గృహనిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీలలో అసంపూర్తిగా ఉన్న పక్కాగృహాలపై దృష్టిపెట్టాలన్నారు. పనులు ప్రారంభించకుంటే రద్దు చేస్తామన్నారు. గృహనిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో మురళి, ఏపీఎం నరసింహులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం

రామసముద్రం : రామసముద్రం మండలంలోని రాగిమాకులపల్లి క్రాస్‌లో ఉన్న హజరత్ పీర్ మున్వర్ అలీషా ఖాదరీ దర్గాలో శుక్రవారం సాయంత్రం దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా ఉరుసు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెల పౌర్ణమి రోజున దర్గా నందు పౌర్ణమి పూజలు నిర్వహిస్తామన్నారు. 1985లో హజరత్ పీర్ మున్వర్ అలీషాఖాదరీ దర్గాను నిర్మించి, 2006 వరకు ఈ దర్గా ఉరుసు ఉత్సవాలు నిర్వహించారని తరువాత ఆయన మరణానంతరం 2006 నుంచి దర్గా కమిటీ సభ్యులు ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వర్షంతో నేలకొరిగిన వరి పంట

తంబళ్లపల్లె : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షం, గాలులకు కోతకు వచ్చిన వరిపంట నేలకొరిగింది. రైతులకు అపారనష్టం కలగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్‌లో సుమారు 590 ఎకరాలలో ఎకరాకు రూ.40వేల ఖర్చుతో రైతులు వరి పంటను సాగు చేశారు. ఇప్పటికే సుమారు 200 ఎకరాలలో పంట కోసివేశారు. గోపిదిన్నె పంచాయతీ కొత్తపల్లికు చెందిన ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలు సుమారు నాలుగు ఎకరాలో వరి పంట సాగు చేశారు. కోత దశలో వారి పంట మొత్తం వర్షానికి పూర్తిగా నేలకొరిగింది. వ్యవసాయ శాఖ ఏఓ రమణకుమార్ మాట్లాడుతూ రైతులు వరిపంటలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



వర్షానికి నేలకొరిగిన వరి పంట

అభ్యంతరాలు ఏడు రోజుల్లో తెలియజేయాలి

తంబళ్లపల్లె : మండలంలోని రేణుమాకులపల్లె పంచాయతీ మిట్టమాలపల్లెలో వెలసిన శ్రీరామాలయం దేవాదాయశాఖలో రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఏడు రోజుల్లో జిల్లా దేవాదాయశాఖ కార్యాలయంలో ప్రజలు తెలియజేయాలన్నారు.

వెండి ఆభరణం వితరణ



వెండి ఆభరణాన్ని అర్చకుడికి ఇస్తున్న దాతలు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక పౌర్ణమికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మదనపల్లెకు చెందిన హరినాథరెడ్డి కుటుంబ సభ్యులు 39,600 విలువ చేసే వెండి యజ్ఞోపవీతాన్ని(జంధ్యం) వితరణగా స్వామివారికి ఇచ్చారు. ఈ ఆభరణాన్ని అర్చకులు రమేష్ స్వామివారికి అలంకరించారు. భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

నియామకం

కలికిరి : పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా కలికిరికి చెందిన న్యాయవాది బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రకటించారు. రాష్ట్రంలో నియోజకవర్గాల ఇన్‌చార్జిల నియామకంలో భాగంగా తనపై నమ్మకంతో నియోజకవర్గ బాధ్యలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి రుణపడి ఉంటానని, ప్రజా సమస్యల పట్ల పోరాడుతామని సోమశేఖర్ రెడ్డి తెలిపారు.

వేలంపాటలో ఆదాయం

రామసముద్రం : మండలంలోని కురిజల గ్రామంలో వెలసి ఉన్న శ్రీచెన్నరాయస్వామి దేవాదాయ భూములైన 2.18 ఎకరాలు విస్తీర్ణం గల భూములను శుక్రవారం దేవాదాయశాఖ అధికారులు వేలంపాట నిర్వహించారు. మూడు సంవత్సరాల పాటు కౌలుకు ఇచ్చేందుకు జరిగిన వేలంలో అదే గ్రామానికి చెందిన రెడ్డెప్ప సంవత్సరానికి రూ.21 వేలకు దక్కించుకున్నారు. 3 సంవత్సరాలకు కౌలుకు గాను రూ.63 వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో కార్తీక మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం వేడుకలను నిర్వహించారు. కార్తిక దీపోత్సవం, ఆకాశదీపం, జ్వాలా తోరణం కార్యక్రమాలకు నిర్వహించి అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పిచ్చిమొక్కల తొలగింపు

పెద్దమండ్యం : పెద్దమండ్యం–గుర్రంకొండ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న సూచిక బోర్డులకు అడ్డుగా ఉన్న పిచ్చిమొక్కలను హెల్పింగ్ మైండ్స్ బృందం సభ్యులు తొలగించారు. శుక్రవారం తురకపల్లె ఘాట్, కలిచెర్ల, శిద్దవరం ప్రాంతాలలో సూచిక బోర్డులను ఆర్అండ్‌బి అధికారులు ఏర్పాటు చేశారు. అయితే పిచ్చిమొక్కలతో సూచిక బోర్డులు కనబడకుండా పోవడంతో హెల్పింగ్ మైండ్స్ బృందం సభ్యులు ఒక్కరోజు శ్రమదానం చేసినట్లు వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ తెలిపారు. కార్యక్రమంలో మీర్ మొఖద్దర్, సంస్థ సభ్యులు షౌకత్, వసీం, మహమూద్ రఫీ, శహవేజ్ లు పాల్గొన్నారు.

మా గొంతు తడిపి పుణ్యం కట్టుకోండి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీ బాగేపల్లికి చెందిన ప్రజలు తాగునీటి సమస్య పరిష్కరించాలని శుక్రవారం ఈవోఆర్డీ యోగానంద్ ఎదుట వారి గోడును వెళ్ళబోసుకున్నారు. ప్రభుత్వ బోరు మోటారు కాలిపోయినందున నీటి ఎద్దడి నెలకొందని వాటికి మరమ్మతులు చేసి మా గొంతు తడిపి పుణ్యం కట్టుకోమని ప్రజలు అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మోటారు మరమ్మతులు చేయించి నీటి సమస్య పరిష్కరించేలా చొరవ చూపుతామని ఈవోఆర్డీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ విషయంపై సర్పంచ్ లక్ష్మీదేవి మాట్లాడుతూ గతంలో గ్రామ అభివృద్ధి కోసం రూ.లక్షలు ఖర్చుపెట్టి చేసిన పనులకు అధికారులు ఇంత వరకు బిల్లులు పెట్టలేదన్నారు. పంచాయతీలో నిధులు ఉన్నా అధికారులు బిల్లులు పెట్టేందుకు ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

సర్పంచ్‌లపై వివక్ష

గత వైఎస్సార్‌సీపీ పాలనలో సర్పంచ్‌లుగా ఎన్నికైన చాలా మంది ప్రజా ప్రతినిధులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా అయోమయ స్థితిలో ఉన్నారు. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ, ప్రధానంగా తాగునీటి బోరు మోటర్ల మరమ్మతులు, పలు అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామ ప్రథమ పౌరులకు బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలు ఉండగా సగం మందికి పైగా సర్పంచ్‌లపై కూటమి నాయకులు కక్షగట్టినట్లు విశ్వసనీయ సమాచారం. పంచాయతీలో ఉన్న నిధులను డ్రా చేయాలని సర్పంచ్‌లు అధికారులకు సూచించినా సదరు అధికారులు మాత్రం మా చేతుల్లో ఏం లేదు ములకలచెరువుకు చెందిన టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి వద్దకు వెళ్ళి వస్తే సునాయాసంగా మీ పనులు జరుగుతాయని అధికారులే చెప్పడం ఎంత వరకు సమంజసమని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల, గ్రామస్థాయి అధికారులు ఇకనైనా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చేసిన పనులకు బిల్లులు పెట్టి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని లేని పక్షంలో తాము చట్టపరంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి ఉంటుందని సర్పంచ్‌లు స్పష్టం చేస్తున్నారు.



తాగునీటి సమస్యపై ఈవోఆర్డీని ప్రశ్నిస్తున్న ప్రజలు

గొర్రెల పెంపకందార్ల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు : గొర్రెల మేకల పెంపకందార్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె. రామాంజనేయులు కోరారు. శుక్రవారం స్థానిక మదనపల్లె మార్గంలోని గొర్రెల మేకల పెంపకం దార్ల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2.20 లక్షల గొర్రెల మేకల సంపదపై నాలుగు లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. వీరి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం ఐదు శాతం నిధుల కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు నారాయణబాబు మాట్లాడుతూ గొర్రెలు, మేకలు పెంపకంలో మేత, నీరు, వైద్య, వృత్తి రక్షణలో పెత్తదారుల దాడుల, రోడ్డు ప్రమాదాలు, తదితర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అర్హత కల్గిన కుటుంబాలకు ప్రభుత్వ రాయితీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కాంతారావు, మునిరత్నం, మునిశేఖర్, బాలకృష్ణ, రమేష్, రఘునాథు, గురవయ్య, గుణ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె. రామాంజనేయులు

ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్ల విధానం తగదు

గుర్రంకొండ : ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం గుర్రంకొండలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ సమావేశంలో వారు మాట్లడుతూ అధిక విద్యుత్ బిల్లులు సామాన్య ప్రజలకు శాపంగా మారనున్నాయని అన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, నిర్బంధ భూసేకరణ చట్టం విరమించుకోవాలని కోరారు. కరువు, వరదలు, చీడపీడల వలన పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించే బాధ్యత ప్రభుత్వం బీమా కంపెనీలకే అప్పగించాలన్నారు. పంటల బీమా ప్రీమియంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే రైతుల తరఫున చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఉపాధిహామీ పని దినాలను 200 రోజులకు పెంచి రోజువారి వేతనం రూ. 600 పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించేబోయే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు మురళి, సయ్యద్ ఇక్బాల్, వసీమ్, శివ, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శులు సాంబశివ, కృష్ణప్పలు

సీమ అభివృద్ధి విస్మరిస్తున్న పాలకులు

మదనపల్లె సిటీ : రాయలసీమ అభివృద్ధి వెనుకబడుతూనే ఉందని, రాయలసీమ ఆత్మగౌరవం శ్రీబాగ్ ఒడంబడికను అమలు చేయాలని రాయలసీమ ఉద్యమకారులు, రాష్ట్ర విద్యార్థి సంఘం మాజీ నాయకులు బత్తుల లక్ష్మీపతి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం జరిగి 87 సంవత్సరాలైనా ఇప్పటికీ అమలు జరగకపోవడం బాధకరమన్నారు. శ్రీబాగ్ ఒప్పందంలో చాలా స్పష్టంగా రాయలసీమకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఉందన్నారు. ఎక్కువ సీట్లు ఉన్న కోస్తా వైపే అభివృద్ధి కొనసాగుతుందన్నారు. ఆధిపత్య రాజకీయాల కోసం, ఓట్ల కోసం పాలకులు రాయలసీమ ప్రాంతాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. అమరావతి అనే రాజధానిని ఒక కోస్తా ప్రాంతంలో నిర్మించడం వల్ల రాయలసీమ ప్రాంతీయ రిజర్వేషన్ కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నిజంగా కూటమి ప్రభుత్వానికి రాయలసీమపై అంత ప్రేమ ఉంటే రాజధాని ప్రాంతాన్ని ఫ్రీజోన్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీబాగ్ ఒప్పందం అమలులో జాప్యం జరిగితే తుది పోరు రాయలసీమ రాష్ట్ర పోరాటమే శరణ్యమన్నారు.